క్లుప్తంగా

చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుక్కుగూడ: అనారోగ్యంతో బాధపడుతున్న మంఖాల్ గ్రామానికి చెందిన కె.ప్రేమ్‌సాగర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.60 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు శ్యామేల్ రాజు బాధితుడికి అందజేశారు.

మంత్రి చొరవతో అభివృద్ధి పనులు



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న షేక్ అఫ్జల్

పహాడీషరీఫ్: మంత్రి సబితారెడ్డి చొరవతో జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ మైనార్టీ విభాగం మున్సిపాలిటీ అధ్యక్షుడు షేక్ అఫ్జల్ అన్నారు. వాదేముస్తఫా బస్తీ 21వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు, ట్యాంకుల నిర్మాణం, డ్రెయిన్ బాక్స్‌ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముస్లిం బస్తీల రూపురేఖలు మారేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.

మిస్టరీగానే మహిళ హత్య కేసు

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం శైలజ హత్య కేసు విషయమై సీఐ కృష్ణంరాజు ఆధ్వర్యంలో సిబ్బంది, క్లూస్ టీం దర్యాప్తు చేపట్టింది. పోలీసులు కేసు ఛేదించేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నా కొలిక్కి రాలేదు. అదే రాత్రి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించినా ఫలితం లేదు. గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసి పరారీ అయినట్లు ఆమె భర్త చెబుతున్నాడు. ఆ వ్యక్తిని గుర్తించలేకపోయారు. వీరితో ఎవరికైనా శత్రుత్వం ఉందా..? అసలు ఎందుకు హత్య చేయాల్సి వచ్చిందనే కారణాలు తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా కేసును ఛేదనకు యత్నిస్తున్నట్లు సమాచారం. కాగా శనివారం ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తరలించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కందుకూరులోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఏసీపీ

కందుకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కందుకూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ బూత్‌లను శనివారం అధికారులు పరిశీలించారు. ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఏసీపీ అంజయ్య, సీఐ కృష్ణంరాజు, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి తదితరులు పోలింగ్ బూత్‌లలో చేపట్టిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారి వెంట ఆర్ఐ శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా పుష్కర బ్రహ్మోత్సవాలు

హుడాకాంప్లెక్స్: కర్మన్‌ఘాట్ డిఫెన్స్ కాలనీలో నెలకొన్న హరిహర క్షేత్రం అయ్యప్పస్వామి దేవాలయం భక్తుల పాలిట కొంగు బంగారంగా మారిందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన మహా సుదర్శన సహిత ధన్వంతరి హోమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి సారథ్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అయ్యప్పస్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రూ.55,500 పలికిన కొబ్బరికాయల వేలం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించి శనివారం ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల వేలంపాట నిర్వహించారు. ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్‌రెడ్డి, ఈట మోహన్‌రావు సమక్షంలో వేలంపాట నిర్వహించగా గంగపురం మల్లేశ్ రూ.55,500కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు, మణిక, నరహరి, అర్చకులు రామాచారి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కుక్కలున్నాయి జాగ్రత్త

వీధి కుక్కల వీరంగం నానాటికీ పెరిగిపోతోంది. దారిన పోయే వారిని దొరకబుచ్చుకొని మరీ దాడులకు తెగబడుతున్నాయి. పురపాలికలోని ఏ ప్రాంతంలో చూసినా గుంపుగుంపులుగా తిరుగుతూ ప్రజలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. వీధుల్లో తిరిగేవారికి దడపుట్టిస్తూ దౌడ్ తీయిస్తున్నాయి.

- బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు
- గుంపులుగా రోడ్లపై సంచారం
- బాటసారులను పరుగులు పెట్టిస్తున్న వైనం
- వాహనదారులను వెంబడిస్తున్న శునకాలు



రావిర్యాల చౌరస్తాలో వీధికుక్కల సంచారం

తుక్కుగూడ: మున్సిపాలిటీలో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. వీధులు, రోడ్లపై గుంపులుగా స్వైర్య విహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రావిర్యాల, తుక్కుగూడ, మంఖాల్, సర్దార్‌నగర్, దేవేందర్‌నగర్ కాలనీ, ఇమామ్‌గూడ, ఇలా ఏ గ్రామంలో చూసినా.. శునకాల బెడద పెరగడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అవి కరవకపోయినా వాటిని చూసిన జనం జంకుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈ–సిటీ, మంఖాల్ పారిశ్రామిక వాడ, హార్డ్‌వేర్ పార్కు తదితర పరిశ్రమలతో పాటు వండర్‌లా పర్యాటక కేంద్రం ఉండటంతో ఇక్కడ అనేక మంది ఉపాధి పొందుతున్నారు. దీంతో ఇక్కడ విధులు ముగించుకొని రాత్రి, తెల్లవారు జామున ఇళ్లకు వెళ్లేవారి వాహనాల లైటు వెలుతురుకు పడుకున్న శునకాలు గుంపులుగా ఒకేసారి పైకి లేవడంతో భయాందోళనకు గురవుతున్నారు. వాహనం అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. పాదచారులపై కూడా దాడులు చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కుక్కల దాడులు పెరగడంతో.. మున్సిపాలిటీ ప్రజలు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వాటి బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఒకే నెలలో వరుస దాడులు..

గత నెల మంఖాల్ పారిశ్రామిక వాడలో పని చేస్తున్న ఒడిస్సాకు చెందిన కార్మికుడు విధులు ముగించుకొని తుక్కుగూడలో తన నివాసానికి వెళుతుండగా.. వీధిలో ఉన్న కుక్కలు దాడి చేయడంతో బైకు అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. అదే నెలలో సర్దార్‌నగర్‌కు చెందిన ఓ విద్యార్థి కళాశాలకు బైకుపై వెళుతుండగా కుక్కలు అడ్డు రావడంతో ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరాడు. ఫిబ్రవరి 23న రావిర్యాలలో ఓ రైతుకు చెందిన మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో అవి తీవ్రంగా గాయపడి మృతి చెందాయి.

బీభత్సం సృష్టిస్తున్నాయి



మున్సిపాలిటీలోని ప్రతి వీధిలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీధులు, రోడ్లపై వెళుతున్న వాహనాల వెంట పడి దాడి చేయడంతో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు.మా రావిర్యాల గ్రామంలో మూడు రోజుల కిందట మేకలపై దాడిచేసి వాటి మృతికి కారణమయ్యాయి. అధికారులు కుక్కల బెడద తీర్చాలి.

– సీయోదన్, రావిర్యాల

చర్యలు శూన్యం



మున్సిపాలిటీలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇటీవల అవి మనుషులు, మూగజీవాలపై దాడులకు తెగబడుతున్నాయి. అయినా వాటి నియంత్రణకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– ధనంజయ్, ఇమామ్‌గూడ

నడక ఆరోగ్యానికి ఎంతో మేలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: నడక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రతిరోజు వాకింగ్ చేస్తే ఎలాంటి రోగాలు దరిచేరవని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోంలో వాకర్స్‌తో కలిసి ఆయన వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా హోం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సరైన వ్యాయామం, నడక లేకపోవడంతో యువకులు గుండెపోటుతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నడక అలవర్చుకోవాలని సూచించారు. తాను నడవడంతో పాటు పది మందికి నడక ప్రయోజనం తెలపాలని కోరారు. హోంగ్రౌండ్ వేలాది మంది వాకింగ్‌కు రావడం అభినందనీయమని, వాకర్స్‌కు ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వీఎం హోం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్‌గౌడ్ సమస్యను కూడా హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం చేయించానని తెలిపారు. వాకర్స్ తనపై చూపిన అభిమానాన్ని మర్చిపోలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు జక్కుల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, కైరంకొండ ధనుంజయనేత, కొండ గిరిగౌడ్, ఐలయ్య యాదవ్, దుబ్బాక శశిధర్‌రెడ్డి, కబీర్దాస్‌గౌడ్, మేకల వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నేడు కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

- హాజరుకానున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి సమావేశాన్ని ఆదివారం వంగా శంకరమ్మ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ ప్రతినిధులు వంటేరు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, కార్పొరేషన్‌లోని కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు పాల్గొని సమస్యలను తెలుపవచ్చని పేర్కొన్నారు.

స్టాఫ్ అండ్ వర్కర్స్ నూతన కమిటీ

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం దాసరి బాబు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, బాలాపూర్ మండల కార్యదర్శి యాదయ్య, సీఐటీయూ బాధ్యులు పెంటయ్య, ప్రజాసంఘాల కన్వీనర్ యాదయ్య సమక్షంలో మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా యాదగిరి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, కమలమ్మ, ప్రధాన కార్యదర్శిగా బోడ నర్సింహ, సహాయ కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా భారతమ్మ, అంజయ్య, బాలరాజమ్మ, నర్సమ్మ, లలిత, స్వరూప ఎన్నికయ్యారు. అనంతరం కార్మికులకు కనీస వేతనం, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రశాంతిహిల్స్ రాస్తారోకో నిర్వహించారు.



సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

మరో మిథాలీరాజ్!

- ప్రతిభకు పేదరికం అడ్డుకాదు
- జాతీయ స్థాయిలో రాణిస్తున్న యువ క్రికెటర్
- భారత మహిళా జట్టులో ఆడటమే లక్ష్యమంటున్న చందన

హుడాకాంప్లెక్స్: పేదరికం ప్రతిభకు అడ్డుకాదని నిరూపించింది ఆ యువతి. జీవితంలో అనేక ఆర్థిక ఒడిదొడుకులను ఎదుర్కొంటూ.. అటు క్రికెట్‌లోనూ, ఇటు ఉన్నత విద్యలోనూ రాణిస్తూ మాజీ క్రికెటర్ మిథాలీ రాజ్‌ను తలపిస్తోంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో బహుమతులు గెలుచుకొని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. దాతలు ముందుకొచ్చి ఆర్థికంగా సహకారం అందజేస్తే భవిష్యత్తులో మహిళా విభాగంలో దేశం తరఫున ఆడి కన్నవారికే కాదు... దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తానని చెబుతోంది ఆ యువ క్రీడాకారిణి చందన.

అన్నను ఆదర్శంగా..

నల్లగొండ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన కిషన్, పుష్పలత దంపతుల కుమార్తె చందన ప్రస్తుతం కొత్తపేట మార్గదర్శి కాలనీలోని శ్రీరాం డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతోంది. చిన్ననాటి నుంచి ఆమెకు క్రికెట్ ఆట అంటే ప్రాణం. తన సోదరుడు భానుప్రసాద్ నిత్యం ఆయన స్నేహితులతో కలిసి మైదానంలో క్రికెట్ ఆడేవారు. అన్నను ఆదర్శంగా తీసుకున్న చందన.. ఆటపై దృష్టి సారించింది. క్రికెట్‌పై ఉన్న ఆసక్తితో సాధన చేసింది. గ్రౌండ్‌లో ఆమె ఆటతీరును చూసిన కోచ్ రాజశేఖర్ వెన్నుతట్టి ప్రోత్సహించారు.

చదువుకుంటూనే..

ఒక వైపు చదువుకుంటూనే.. మరో వైపు ప్రాక్టీస్ చేసేది. 2017 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–16 విభాగంలో హైదరాబాద్, బెంగళూరు, కేరళ, ఏపీల్లోనూ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొని బ్యాట్స్‌మెన్‌గా ఉత్తమ ప్రతిభను కనబరిచింది. 2018లో జమ్మూలో జరిగిన అండర్–17 విభాగంలో జరిగిన పోటీల్లో సిల్వర్ సాధించింది. అదే సంవత్సరం మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన క్రికెట్ (టెన్నిస్‌బాల్) పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. ఇప్పటివరకు పది పోటీల్లో పాల్గొంది. భవిష్యత్తులో భారత మహిళా క్రికెట్ జట్టు తరఫున ఆడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.



చందన

రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలి

మంత్రి సబితారెడ్డికి మైనార్టీ నేతల వినతి



మంత్రి సబితారెడ్డితో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

పహాడీషరీఫ్: త్వరలో రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు ప్రార్థనా మందిరాల వద్ద ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కైసర్ బామ్ శనివారం మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజీద్‌ల వద్ద పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించాలన్నారు. వీధి దీపాల సమస్య లేకుండా చూడాలన్నారు. ముస్లిం మైనార్టీ బస్తీల్లో సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాకీర్ తదితరులున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారాం జనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు శ్రీసత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ అంజనేయ స్వామి ఆలయం పూజారి తొండుపల్లి సంతోష్ శర్మ, వీరేశం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా తిరుకల్యాణం



కల్యాణోత్సవంలోని ఓ ఘట్టం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ (ఈ–సిటీ) శ్రీ ఆదిలక్ష్మి అలివేలు మంగ సమేతా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రాత్రి శ్రీ వేంకటేశ్వర స్వామి అలివేలు కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణానికి ముందు ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, కట్నకానుకలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుదాం: కాంగ్రెస్



భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: మహిళలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చిక్కుళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు భాస్కర్‌రెడ్డి సమక్షంలో పార్టీలోచేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి.. అరాచక పాలనకు చరమగీతం పాడతారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారి బాబు, నాయకులు సామిడి గోపాల్‌రెడ్డి, పున్న గణేశ్‌నేత, బండి మధుసూదన్‌రావు, మహ్మద్ గుల్షన్, ధరావత్ స్వామి నాయక్, ఇమ్రాన్, తాంద్ర భాస్కర్, కల్యాణ్ యాదవ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన కల్పించండి

కాంగ్రెస్ నేత భాస్కర్‌రెడ్డి



ప్రదర్శనలను తిలకిస్తున్న భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి

హుడాకాంప్లెక్స్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతన వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదపడతాయని మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం లయోలా స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతతో పాటు ఆయన హాజరయ్యారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంతో పాటు శాస్త్ర, సాంకేతికతపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. లయోల స్కూల్ అధినేత గుల్షన్, నాయకులు గోపాల్‌రెడ్డి, శివప్రసాద్, మధుసూదన్‌రావు, ధన్‌రాజ్‌గౌడ్, ఇమ్రాన్, సుధాకర్‌గౌడ్, యాదగిరిగౌడ్, చిన్నస్వామినాయక్, సిద్దేశ్వరచారి, రంజిత్, పవన్, కౌశిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షు డు చల్లా నరసింహారెడ్డి హైద్రాబాద్ గాంధీభవన్‌లో శనివారం ప్రభాకర్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి గత దశాబ్దకాలంగా పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు వంశీచంద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, సర్పంచ్ శ్రీశైలం, కల్వకుర్తి సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రవీందర్‌యాదవ్, సేవాదల్ అధ్యక్షుడు దశరథం, యువజన అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, చెన్నకేశవులు, రామ్‌లక్ష్మణ్, సత్యం, రమేష్, భిక్షపతి, ఆరీఫ్, గౌస్ వెంకటేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను అన్నిరంగాల్లో ప్రోత్సహిద్దాం

సీడీపీఓ షబానా

కందుకూరు: బాలికల అభ్యున్నతికి కృషి చేయాలని సీడీపీఓ షబానా తెలిపారు. మండల పరిధిలోని పంతులు తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'బేటీ బచావ్–బేటీ పఢావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల చదువు, వారి ఎదుగుదలకు కావాల్సిన అంశాలను వివరించారు. అనంతరం 5 సంవత్సరాల్లోపు పిల్లలకు బరువు చూసి తక్కువ బరువు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పౌష్టికాహారం ఆవశ్యకతను తెలియజేశారు. తండాకు చెందిన మౌనిక కానిస్టేబుల్ పరీక్షలో మెయిన్స్‌కు అర్హత సాధించిన నేపథ్యంలో మెను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, ప్రధానోపాధ్యాయుడు జహంగీర్, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీళ, జ్యోత్స్న పాల్గొన్నారు.



బాలికలు, తల్లులతో ఐసీడీఎస్ అధికారులు

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: కుటుంబ పాలన, అవినీతితో ప్రజలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత బీఆర్ఎస్ పాలనలో విసిగివేసారి పోయారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో బీజేపీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి అందెల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చేపట్టిన ప్రజాగోస– బీజేపీ భరోసా పేరుతో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లు మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, డివిజన్లు, మండలాల్లో విజయవంతమైనట్లు పేర్కొన్నారు. దేశ ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రజల సంక్షేమం కోసం నరేంద్రమోడీ రూ.50 చెల్లించి రూ.5 లక్షల ఆరోగ్య బీమా పొందేలా చేశారని అన్నారు. ప్రతి పేద, మధ్యతరగతి వర్గాల వారు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, పార్టీ నాయకులు, మహిళలు ఉన్నారు.



ఆయుష్మాన్ భారత్ పత్రాలను అందజేస్తున్న శ్రీరాములు యాదవ్

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఈద్గా, శ్మశానవాటికల వద్ద ప్రహరీల నిర్మాణం, మసీద్‌ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మైనార్టీ నేతలు శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ విషయమై ఎమ్మెల్యే.. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో వీడియో కాల్‌లో మాట్లాడగా.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అర్షద్, మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావీద్, ఇమామ్ జహీరుద్దీన్, మైనార్టీ నాయకులు వాహబ్, మోయిన్, మహబూబ్‌అలీ, నిజాం, హిమాయత్‌అలీ, ఆమేర్, ఖాలేద్, ఆరీఫ్, మైనుద్దీన్ ఉన్నారు.

రోడ్డు మరమ్మతులకు నిధుల మంజూరు..

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన–నిర్ధవెళ్లి రోడ్డు మరమ్మతు పనులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తన ఎమ్మెల్యే కోటా నుంచి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. చంద్రధన–నిర్ధవెళ్లికి వెళ్లే మట్టిరోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని స్థానిక నాయకులు ఇటీవల ఎమ్మెల్యేను కోరగా స్పందించిన ఎమ్మెల్యే రూ.5 లక్షలు మంజూర్ చేస్తున్నట్లు శనివారం తెలిపారు. నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.